క్లుప్తంగా

డీటీ నాగరాజుకు పదోన్నతి



శావల్యాపురం: మండల డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగ రాజు 2019 గ్రూపు–2 ద్వారా నియామకం అయ్యారు. మొదటగా డిప్యూటీ తహసీల్దారుగా కారంపూడి మండలంలో రెండు సంవత్సరాల విధులు నిర్వహించారు. సాధారణ బదిలీపై శావల్యాపురం మండలంలో గత నాలుగు సంవత్సరాల నుంచి డిప్యూటీ తహసీల్దారు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డిప్యూటీ తహసీల్దార్ల పదోన్నతి జాబితాలో తహసీల్దారుగా నాగరాజు పదోన్నతి పొందారు. తహసీల్దారు కె.సుజాత, డిప్యూటీ సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, ఆర్‌ఐ చంద్రబాబు, వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఉప్పుటూరి చిన మంగయ్య, మల్లెల రాధ, వీరవల్లి నాగ వెంకట సంతోషలక్ష్మి, దూపాటి దేవమ్మ, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

27 నుంచి ఉచిత యోగ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 184వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు శిబిర నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ శుక్రవారం తెలిపారు. వివరాలకు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి ఐ.మురళీ తెలిపారు. మండలంలోని గురవాయపాలెం బీసీ కాలనీ మండల పరిషత్ పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డేటా నమోదు చేయండి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల వివరాల నమోదు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల రికార్డులు, అపార్, మిగిలిన వివరాల అంశాల నమోదు అసంపూర్తిగా ఉందని గుర్తుచేశారు. మండలంలోని మొత్తం పాఠశాలలకు చెందిన 5263 రికార్డులు ఉండగా 1705 రికార్డులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని, మిస్సింగ్ డేటా పూర్తి నమోదు తప్పనిసరి అని ఆదేశించారు.

దాడి చేసిన ముగ్గురిపై ఫిర్యాదు

నాదెండ్ల: వాకింగ్ చేస్తున్న తనపై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారంటూ చిరుమామిళ్ల గ్రామానికి చెందిన మెట్టు కోటిరెడ్డి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 21 రాత్రి 8 గంటల సమయంలో తాను వాకింగ్ చేస్తుండగా తనపై గ్రామానికి చెందిన భవనం శ్రీనివాసరెడ్డి, గంటా హరికృష్ణ, వణుకూరి వెంకటేశ్వరరెడ్డిలు దాడికి పాల్పడి తనను గాయపరిచారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనను కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారన్నారు. చికిత్స అనంతరం నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిలేదీక్షలు జయప్రదం చేయాలి

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలానికి ఒప్పందాలను అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, ఆప్కాసులో లేని కార్మికులను ఆప్కాస్ చేర్చాలనే డిమాండ్ల కోసం వచ్చేనెల ఫిబ్రవరి 8, 9 ,10 తేదీలలో చేపట్టే రిలే దీక్షలు జయప్రదం చేయాలని జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం పల్నాడు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది జనవరి 10వ తేదీన సమ్మె ముగిసిన సందర్భంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు ఇంతవరకు జీవోలు ఇవ్వలేదని, వెంటనే జీవోలు విడుదల చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు తొమ్మిది మంది అధికారులతో కమిటీ వేసి ఆ కమిటీ నివేదిక ప్రకారం వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,9,10 తేదీలలో అన్నీ మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్, శానిటేషన్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తారని వివరించారు. జిల్లా అధ్యక్షురాలు వై.చంద్రకళ, షేక్ చిన్న అల్లా బక్షు, పి నవీన్, పి.సునీత పాల్గొన్నారు.



స్వర సుధామయి.. భారతీ!

- సినీ, లలిత భక్తిగీతాలాపనలో రాణిస్తున్న యడ్లపాడు కళాకారిణి
- తెలుగు రాష్ట్రాల్లో వందలాది ప్రదర్శనలు
- ఎన్నో అవార్డులు, ప్రముఖుల ఘన సత్కారాలు



గాయని భారతికి మధురగాన సరస్వతి బిరుదు అందజేస్తున్న నిర్వాహకులు (ఫైల్)

యడ్లపాడు: ఆమె స్వరం ఎంతో శ్రావ్యంగా ఉంటుంది. ఆమె గళం సంగీత ప్రియులను ఆకట్టుకుంటుంది. ఆమె గానం శ్రోతలను ఇట్టే కట్టి పడేస్తుంది. సినిమా, జానపద, లలిత సంగీతం, భక్తిగీతాలు ఏ పాటపాడిన తన గాత్ర మాధుర్యంతో ప్రేక్షకుల్ని మైమరపిస్తుంది. దేవస్థానాల్లో జరిగే సంగీతోత్సవాల్లో ఆమె సంకీర్తనా గానానికి భక్తులు సైతం తన్మయత్వం చెందాల్సిందే. ఆమె స్వరానికి చప్పట్లు మోగాల్సిందే.. ఆమె పోటీ పడితే అభినందనల జల్లులు కురవాల్సిందే. ఒక్కమాటలో చెప్పాలంటే వసంత ఋతువులో ఆనందంగా పరవశించి పాడే కోయిల గొంతులా.. వీనుల విందుగా సుమధురంగా ఉంటుంది. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సాంస్కృతిక సంస్థల నుంచి అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. పాత, కొత్త తరాల గాయకులు ఆలపించిన అన్ని పాటల్ని పాడుతూ 'బహుగళ గాయని'గా గుర్తింపు తెచ్చుకుంది. ఆమె చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ భారతి.

పాఠం నుంచి పాటవైపు!

వ్యవసాయ కుటుంబమైన బెల్లంకొండ ఆంజనేయులు, ధనలక్ష్మి దంపతుల ఏకైక సంతానం భారతి. ఎంఏ బీఈడీ, ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్ పూర్తి చేసి కొన్నాళ్లు ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. సంగీతంపై లోలోన దాగున్న ఆసక్తి అంతకంతకూ పెరిగింది. దీంతో పాఠం నుంచి పాటవైపు ఆమె మనసు మళ్లింది. గాయకురాలిగా నిలిచి పాటే ప్రాణంగా నేడు జీవిస్తోంది. అలా ఆమె పాల్గొన్న ప్రతి సంగీత పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా మార్టూరుకు చెందిన హరిబాబు భారతికి సంగీతాన్ని నేర్పించిన గురువు. కఠోర శిక్షణ, నిత్య సాధన సంగీత వేదికలపై సగౌరవంగా నిలబెట్టాయి. పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుంటూరులోని మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీత కళాశాలలో కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి, ప్రస్తుతం డిప్లొమో కోర్సును అభ్యసిస్తోంది.

ప్రముఖుల నుంచి సత్కారాలు

తెలంగాణ సచివాలయ ఉన్నతవిద్యామండలి కార్యదర్శి కుమారి, తెలుగు సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు వంగపండు ఉష, అప్పటి మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, గుర్రం జాషువా మనవడు బీఆర్ సుశీల్‌కుమార్, సినీసంగీత దర్శకులు కోటి సోదరులు, సాలూరి వాసు వంటి ప్రముఖుల నుంచి ఘనసత్కారాలు పొందారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం

సుశీల్ మీడియ ఎంటర్‌టైన్‌మెంట్, ఆదమవర్ష్ బ్యాండ్ (ఇండియా)సంస్థ ప్రముఖ గాయకులు బాలు నుంచి గీతామాధురి వరకు 5 డివోషనల్ క్యాసెట్లు రూపొందించగా, ఆ తర్వాతస్థానం భారతి దక్కించుకున్నారు. అమెరికాకు చెందిన 'రిథమ్' మెలోడిస్ సంగీతసంస్థ అనాథ బాలల సహాయార్థం నిర్వహించిన కార్యక్రమంలో భారతి భాగస్వాములయ్యారు.

సినిమాల్లో అవకాశం

భీమ్లా నాయక్ ఫేం ఎంఎస్ చౌదరి నిర్మించిన 'నభయం నాలజ్జ'..'ఒకసారి నిన్ను ప్రేమించాకా' సినిమాల్లో ప్లేబ్యాక్ సింగర్‌గా భారతి పాటలు పాడారు.

అవార్డుల పంట

భారతీ మండలం మొదలు జాతీయ, అంతర్జాతీయస్థాయి సంగీత పోటీల్లో పాల్గొంది. ఆమె పాల్గొన్న ప్రతి పోటీలోనూ ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోవడం భారతీ ప్రతిభకు తార్కాణం. భద్రాద్రి బాలసుబ్రమణ్యం కళాపరిషత్ భారతిని 'యువగాయని'గా, తెనాలి ఘంటసాల సాంస్కృతిక సంస్థ, పిడుగురాళ్ల స్వరసుధ సాంస్కృతిక సంస్థ, 'జూనియర్ భానుమతి'గా, విజయవాడ డ్రీమ్‌ఆడియోసంస్థ 'రాగకోకిల' బిరుదుతో సత్కరించాయి. స్వరరంజిని, ఎన్టీఆర్ కల్చరర్ అసోసియేషన్, సుశీల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా 'స్వరసుధామయి', విజయవాడ ప్రణవి మ్యూజికల్ అకాడమీ 'మధురగాన సరస్వతి', ఒంగోలు గురవారెడ్డి కళాసాంస్కృతిక సంస్థ 'గాన సరస్వతి', అమెరికా సాంస్కృతిక సంస్థ వంశీ ఆన్‌లైన్ పోటీలు నిర్వహించి 'గ్లోబల్' అవార్డు అందజేసింది. 2020లో కళాతోరణం ఉభయరాష్ట్రాలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 'సూపర్‌సింగర్' అవార్డు, ఒంగోలు జవహర్‌లాల్ నెహ్రూ సాంస్కృతిక సేవాసంస్థ 'ఉత్తమగాయని' బిరుదుల్ని అందుకుంది.



అవార్డులతో భారతి

ప్లే బ్యాక్ సింగర్స్‌తో..



పాటలు పాడుతూ...

సినీ సింగర్స్ మంగ్లీ, గోపికా పూర్ణిమా, యామిని, రాము, మల్లికార్జున, సూపర్ సింగర్స్ విజేత శ్రీలలిత, తెలంగాణ ప్రజాగాయకురాలు విమలక్కతో కలిసి భారతీ వేదికపై గానం చేశారు. ఇప్పటికే 100 సంగీత సంస్థల్లో ఉత్తమ గాయనిగా ప్రథమ స్థానాన్ని సాధించారు. ఎన్నో దేవాలయాల్లో సంకీర్తన కచేరీలను చేసి ధర్మకర్తల, భక్తుల మన్ననలు పొందారు.

పూర్వవైభవం తీసుకువస్తా



సిని జగత్తులో సింగర్‌గా పేరు సుస్థిరస్థానం సంపాదించుకుని, మన శాస్త్రీయ సంగీత కళలను భావి తరాలకు అందించేందుకు జిల్లాలో కర్ణాటక సంగీత కళాశాలను ఏర్పాటు చేయాలని ఉంది. శాస్త్రీయ సంగీతం సామాన్యులకు అందుబాటులోకి తేవాలి. ఉభయ తెలుగురాష్ట్రాల్లో విస్తృత ప్రచారం కల్పించి శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవాన్ని తీసుకురావాలన్నదే అభిలాష. –భారతి

టూటౌన్ ఎస్‌ఐగా ప్రియాంక



నరసరావుపేటటౌన్: టూటౌన్ ఎస్ఐగా కె. లేఖ ప్రియాంక శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు టూటౌన్ ఎస్ఐగా పనిచేసిన అశోక్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో ఆమెను నియమించారు. టూటౌన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ఎస్ఐ ప్రియాంక తెలిపారు.

రొంపిచర్ల ఎస్‌ఐగా ..



రొంపిచర్ల: పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా సి.హెచ్. మణికృష్ణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసరావుపేట, చందోలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న అశోక్ నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

శిలువ ధ్వంసకారకులను శిక్షించాలి

చిలకలూరిపేట: వినుకొండలోని బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ఉన్న శిలువను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు అందెల శౌరి, కార్యదర్శి దార్ల రాజేష్ డిమాండ్ చేశారు. వినుకొండలో శిలువను ధ్వంసం చేయడం, చర్చికి సంబంధించిన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శిలువను ధ్వంసం చేయడం అంటే క్రైస్తవుల మనోభావాలు దెబ్బ తీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో అశాంతికి కారణమయ్యే ఇలాంటి సంఘటనకు పాల్పడే వారిని పోలీసులు వెంటనే గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

రైతుల భాగస్వామ్యం తప్పనిసరి

తహసీల్దారు రమేష్ కుమార్



వినుకొండ (నూజెండ్ల): రీసర్వే పనుల్లో రైతులందరూ భాగస్వామ్యం కావాలని తహసీల్దారు ఆర్. రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని త్రిపురపురంలో గ్రామంలో రీసర్వే పై రెవెన్యూ అధికారులు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న భూహక్కుదారులందరూ రీసర్వే పనుల్లో తమవంతు సహకారం అందించి సమగ్ర సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు ఇవ్వాలన్నారు. భూములకు సంబంధించి సరిహద్దులను రెవెన్యూ అధికారులకు రైతులు చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు బాల వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిషోర బాలికల హక్కులను పరిరక్షించాలి

చిలకలూరిపేట: కిషోర బాలికల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండలంలోని కోమటినేనివారిపాలెం గ్రామ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కరిముల్లా చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను చదివించటంతో పాటు వారికి స్వేచ్ఛా జీవితాన్ని అందిద్దామని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు ఆర్ సామ్రాజ్యం, ఎస్.భూలక్ష్మి మాట్లాడుతూ బాలికలలో రక్తహీనత ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అన్ని రంగాలలో బాలికలు అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని చెప్పారు. ఆడపిల్ల పుట్టుక అదృష్టంగా తల్లిదండ్రులు భావించాలని చెప్పారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి సీతా మహాలక్ష్మి, జి.కోటేశ్వరమ్మ, పి.మరియమ్మ, కె విశాలి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

మాదక ద్రవ్యాల నియంత్రణపై బాధ్యతగా వ్యవహరించాలి

దిశ డీఎస్పీ ఎంవీ రమణ

నరసరావుపేట రూరల్: మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని దిశ డీఎస్పీ ఎంవీ రమణ తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా దిశ డీఎస్పీ రమణ, సీఐ కేవీ సుభాషిణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. మత్తుకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఏటా మాదక ద్రవ్యాల వినియోగం పెరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మాదక ద్రవ్యాల రవాణాపై సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎస్.కిశోర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డీఎస్పీ రమణను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

ఆస్తుల పరిరక్షణకు పోరాటం చేస్తాం

ఇమ్మానియేలు తెలుగుబాప్టిస్టు చర్చి కమిటీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు కోసం ఎందాకైనా పోరాటం చేస్తామని ఇమ్మానియేలు తెలుగుబాప్టిస్టు చర్చి కమిటీసభ్యులు అన్నారు. స్థానిక చర్చిఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత రాత్రి నర్సరావుపేట రోడ్డులో క్రైస్తవులకు చెందిన స్థలంలో దుండగులు శిలువను ధ్వంసం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 1910 లో అప్పటి ఏబీఎయం ఆస్తులను క్రైస్తవ సంఘీయులు పరిరక్షించుకుని సేవ,విద్యదానం,వైద్యం వంటి సేవాకార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని స్పష్టంగా పొందుపరచినట్లు చెప్పారు. ఆస్తుల విలువ పెరగటంతో కొంతమంది అక్రమార్కులు స్థలాలను అమ్ముకున్నారన్నారు. అలాగే ఏబీఎం ఆస్తుల అమ్మకాలు కొనుగోళ్లు చెల్లవని మద్రాసు హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును న్యాయవాది ఎం.ఎస్ ప్రసాదు తెలిపారు. గతంలో వినుకొండకు చెందిన కొందరు వ్యక్తులు తాము చట్టబద్ధంగానే కొనుగోలు చేశామని అనుకుంటున్నారని కోర్టు తీర్పు ప్రకారం నూతన కమిటీ ఎన్నుకుని వారి ఆమోదం పొందిన అనంతరమే హక్కులు వస్తాయని కొను గోలు చేసిన వ్యక్తులు తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షులు చాట్లరామయ్య, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బేతంగాబ్రియేలు, ఆశీవరప్రసాదు, పిలిప్,ప్రసాదు, పాస్టర్ నాగేశ్వరరావు,జాషువా, జోసఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందాలి

ఎంపీపీ జయరామిరెడ్డి



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చెంచారావు

వినుకొండ(నూజెండ్ల): అర్హత కల్గియున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యత వహించాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధిలో అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. ముక్కెళ్ళపాడు ఎంపీటీసీ సభ్యులు చెంచారావు, పమిడిపాడు గ్రామసర్పంచ్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో చేపట్టిన పనులకు సంబదించి బిల్లులు చెల్లింపులు విషయంలో నిర్లక్షం వహించుతున్నారని కూటమి ప్రభుత్వం ఏర్పాడి ఆరు నెలలు గడుస్తున్నా నేటి వరకు బిల్లులు మంజూరు చేయలేదని ఎంపీడీవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు

ప్రకృతి వ్యవసాయ కేంద్రం నిర్వాహకుడు కందుల రవికుమార్

చిలకలూరిపేట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు, పర్యావరణానికి మేలు జరుగుతోందని ప్రకృతి వ్యవసాయ కేంద్రం నిర్వాహకుడు కందుల రవికుమార్ తెలిపారు. మండలంలోని కావూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం లింగంగుంట్ల గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రసాయన ఎరువులతో భూమి సారం కోల్పోతుందని వివరించారు. ఎలాంటి రసాయన ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువులు, పురుగుమందులకు బదులు వేపకషాయం వంటివి వాడడం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన శరీరానికి అవసరమైన పూర్తి పోషకాలు లభిస్తాయని వివరించారు. ఫెర్టిలైజర్స్ వాడడం వలన పండించిన పంటలలో విషతుల్యాలు ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సహజ సిద్ధంగా ఎద్దు గానుగ ద్వారా నూనెలు తయారు చేసే విధానాన్ని, అందులో లభించే పోషకాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎద్దుగానుగను పరిశీలిస్తున్న విద్యార్థులు

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరచుకోండి

బొల్లాపల్లి: పశుపోషకులు పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరచుకోవాలని ఈపూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు పి. శ్రీనివాసమూర్తి సూచించారు. మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు పలు రకాల వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ, సూడి పరీక్షలకు చికిత్స అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యవసాయ సాగుతో పాటు పశువుల పెంపకం వలన అధిక ఆదాయ వనరులు సమకూరుతాయని పి. శ్రీనివాసమూర్తి తెలిపారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి

వినుకొండ(నూజెండ్ల): పదోవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్షా ఏపీవో వి.సుబ్బారావు అన్నారు. శుక్రవారం నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదోవ తరగతి విద్యార్థులకు సలహాలు సూచనలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో తమ విధులు నిర్వహించి మంచి ఫలితాలు సాధనకోసం కృషి చేయాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. పదోవ తరగతి విద్యార్థులు గ్రేడులు వారీగా విభజించి అందరు నూరు శాతం ఉత్తీర్ణతకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిళ్లకు గురికుండా ఆహారపు అలవాట్లు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, జిల్లా ఏఎంవో శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ట్రాక్టర్లతో ర్యాలీ

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 26న నరసరావుపేట పట్టణంలో ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ప్రకటించారు. శుక్రవారం కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా, కార్మిక సంఘాల నాయకులు ఎస్.ఆంజనేయనాయక్, కాసా రాంబాబు మాట్లాడారు. కేంద్రంలో వరుసగా మూడవ సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలు అమలు చేయడంలో దూకుడుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు గుంటూరు విజయ్ కుమార్, ఏ మారుతి వరప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వైధన వెంకట్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MALLEMARAPU SIVA DEEPTHISREE (Old Name), D/o MALLEMARAPU SREENIVASA RAO , resident of D.No: 3-68,High School Main Road, Mellavagu Village, Bollapalli Mandal, Palnadu District, PIN Code : 522614, Andhra Pradesh,India. I have changed my name as MALLEMARAPU SIVA DEEPTHI SRI (New Name), D/o MALLEMARAPU SREENIVASARAO, hereafter my name is known as MALLEMARAPU SIVA DEEPTHI SRI (New name), D/o. MALLEMARAPU SREENIVASARAO.

రొయ్య పిల్ల అమ్మకం

ఆక్వా రొయ్య రైతు సోదరులకు నమస్కారములు మా సుహాన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (NGR సుబ్బారాయుడు (గ్రూప్) హేచరీస్ పాండురంగాపురం బాపట్ల నందు వనామి Sy Aqua ఆక్వా సీడ్ అమ్మకానికి సిద్దంగా ఉంది. కావున రైతులందరూ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9849795559, 8985346999

